



# ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 సంచిక: 06 ఎడిటర్: మేనం శ్యామ్ ఆదివారం 26-07-2026 పేజీలు: 10


## సిరా చుక్క

నాడు... స్కూలు గంట వినపడగానే
స్వేచ్ఛా పక్షులై ఎగిరిన పాదాలు,
నేడు... అలారం మోత వినపడగానే
భారంగా కదులుత కొన్నవాడివి,
నేడు... చేతినిండా జీతం వస్తున్నా
రూపాయి మిగలని బతుకు వేటలో పడ్డావు.
చెప్పు మిత్రమా... ఎవరు నువ్వు?
నాడు... మార్కుల రేసులో గెలవాలని
కంటి నిండా నిద్రను దాచుకున్నావు,
నేడు... జీతం పెంపు కోసం
కన్న కలలనే తాకట్టు పెడుతున్నావు.
చెప్పు నరుడా... ఎవరు నువ్వు?
నాడు... అమ్మ, నాన్న, ఇల్లే లోకమని
ప్రేమ సామ్రాజ్యంలో బతికావు,
నేడు... అదే కుటుంబం ముఖం చూడటానికి
సెలవుల కోసం సాకులు వెతుకుతున్నావు.
చెప్పు ప్రాణమా... ఎవరు నువ్వు?
కాలం నిన్ను మార్చిందా?
బాధ్యతల సుడిగుండం నిన్ను ముంచిందా?
లేక... బతుకు పోరాటంలో గెలవలేక,
నువ్వే ఆ కాలానికి మోకరిల్లి అలవాటుపడ్డావా?
నిన్నటి నీ స్వచ్ఛమైన రూపానికి,
నేటి నీ యాంత్రిక జీవనానికి,
మధ్యలో నలిగిపోతున్న 'నువ్వు'...
అసలు ఎవరు నువ్వు.

– బెల్లంకొండ రాకేష్ గౌడ్..సూర్యాపేట..



# 21 ఏళ్లకే ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ అవకాశం కల్పించాలి

- కేంద్రానికి సీఎం రేవంత్ డిమాండ్
- ఆగస్టు తొలి వారంలో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని ప్రకటన
- రాహుల్ గాంధీ ప్రధాని అయితే 21 ఏళ్లకే చట్టసభలకు పోటీ అవకాశం కల్పిస్తామని వ్యాఖ్య
- విద్యార్థుల ఉద్యమమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కారణమన్న సీఎం
- విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్రానికి డిమాండ్

**ప్రజా వాయిస్, హైదరాబాద్ బ్యూరో :** చట్టసభలకు పోటీ చేసే కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఆయన, దేశ యువతకు రాజకీయాల్లో మరింత అవకాశాలు కల్పించేలా రాజ్యాంగ, చట్టాల్లో మార్పులు అవసరమని అన్నారు. ఆగస్టు మొదటి వారంలో తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఈ అంశంపై తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ప్రకటించారు.

**21 ఏళ్లకే చట్టసభల్లో అవకాశం ఇవ్వాలి**

దేశ జనాభాలో యువతే అధిక శాతం ఉన్నారని, వారికి చట్టసభల్లోకి వెళ్లే అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని దేశాల్లో 21 ఏళ్లకే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉందని గుర్తుచేస్తూ, భారతదేశంలో కూడా అలాంటి విధానం అమల్లోకి రావాలని కోరారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే ఈ మార్పును అమలు చేస్తామని వ్యాఖ్యానించారు.

**విద్యార్థుల ఉద్యమానికి అభినందనలు**

నీట్ ప్రశ్నాపత్రాల లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు



చేపట్టిన ఉద్యమాన్ని రేవంత్ రెడ్డి అభినందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఘనతను కాంగ్రెస్ ఖాతాలో వేయవద్దని, అది పూర్తిగా విద్యార్థుల ఉద్యమ ఫలితమేనని అన్నారు. యువత సంకల్పిస్తే సాధించలేనిది ఏదీ లేదని వ్యాఖ్యానించారు.

**విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి**

నీట్ అంశంపై ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం డిమాండ్ చేశారు. సోమవారం నాటికి అన్ని కేసులను ఎత్తివేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

**నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను నిరసిస్తూ హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా యువతకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తుందని స్పష్టం చేశారు.

## 'దేశమే ప్రథమం'- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై బండి సంజయ్ స్పందన

- ధర్మేంద్ర ప్రధాన్ నిర్ణయం బాధ్యతాయుతమైనదన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- పదవులు తాత్కాలికం.. ప్రజల విశ్వాసమే శాశ్వతమని వ్యాఖ్య
- 'ఇదే బీజేపీ.. ఇదే ప్రజాస్వామ్యం.. ఎల్లప్పుడూ దేశమే మొదటి ప్రాధాన్యం' అంటూ ఎక్స్‌లో పోస్టు
- నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్



**ప్రజా వాయిస్, బ్యూరో :** నీట్ పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. ధర్మేంద్ర ప్రధాన్ తీసుకున్న నిర్ణయం బాధ్యతాయుతమైనదని పేర్కొంటూ, బీజేపీకి ఎల్లప్పుడూ దేశమే మొదటి ప్రాధాన్యమని, ఆ తర్వాతే పార్టీ ప్రయోజనాలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తమ పార్టీ సిద్ధాంతమని వెల్లడించారు.

**'ప్రజల విశ్వాసమే మా బలం'**


ఎక్స్ వేదికగా స్పందించిన బండి సంజయ్.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే ప్రజల మాట వినడం, వారి గొంతుకను గౌరవించడం,

మిగతా 2లో

## కీసరలో దారుణం..

- మైనర్ బాలికపై ఇద్దరు అన్నలు, మేనమామ లైంగిక దాడి
- ఇంట్లో ఎవరూ లేని సమయంలో అమానుష ఘటన
- ఒక నిందితుడు అరెస్ట్, పరారీలో ఇద్దరు
- నిందితుల కోసం మహారాష్ట్రలో ప్రత్యేక పోలీసు బృందాల గాలింపు
- బాధిత బాలికకు వైద్య పరీక్షలు.. జోనల్ హోమ్‌కు తరలింపు

2 లో



## ధర్మేంద్ర ప్రధాన్ స్థానంలో ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలు

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ప్రధాని సిఫారసుతో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ కేటాయింపు
- ప్రస్తుతం కన్జ్యూమర్ అఫైర్స్, ఆహార, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న జోషి



**ప్రజా వాయిస్, న్యూఢిల్లీ బ్యూరో :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం ఆ శాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం సీనియర్ మంత్రి ప్రహ్లాద్ జోషికి అదనంగా అప్పగించింది. ప్రధాని నరేంద్ర మోదీ సిఫారసు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ధర్మేంద్ర ప్రధాన్ సమర్పించిన రాజీనామాను రాష్ట్రపతి అధికారికంగా ఆమోదించారు.

**ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు**

ప్రస్తుతం కేంద్రంలో కన్జ్యూమర్ అఫైర్స్, ఆహార మరియు ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖతో పాటు పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రిగా కొనసాగుతున్న ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను అదనపు బాధ్యతగా అప్పగించారు. తాత్కాలికంగా విద్యాశాఖ వ్యవహారాలను కూడా ఆయన పర్యవేక్షించనున్నారు.

**సీనియర్ నేతకు మరో కీలక బాధ్యత**

కర్ణాటకలోని ధార్వాడ్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రహ్లాద్ జోషి, బీజేపీ సీనియర్ నాయకుల్లో ఒకరిగా

మిగతా 2లో

## యువత భవిష్యత్తు కోసం.. నా పదవి వీడ్కోలు

- రాజీనామా లేఖలు భావోద్వేగ వ్యాఖ్యలు చేసిన ధర్మేంద్ర ప్రధాన్
- విద్యార్థుల భవిష్యత్తు తనకు ముఖ్యమన్న మాజీ విద్యా శాఖ మంత్రి
- ప్రధాన్ సేవలను కొనియాడిన అమిత్ షా

2 లో



# ఉమ్మడి నల్గొండ కాంగ్రెస్‌లో రగులుతున్న వర్గపోరు

- అధికారంలోనూ ఆధిపత్య పోరు
- ఎమ్మెల్యేలు - ఎమ్మెల్సీల మధ్య విభేదాలు
- కోమటిరెడ్డి వర్గం వర్సెస్ స్థానిక నేతలు
- కార్యకర్తల్లో పెరుగుతున్న అయోమయం
- అధిష్టానం జోక్యం తప్పనిసరి అని అంటున్న స్థానిక సీనియర్ కాంగ్రెస్ నేతలు



**ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్‌కు ఒకప్పుడు ఐక్యతకు చిరునామాగా పేరుండేది. ప్రస్తుతం అదే జిల్లా వర్గ రాజకీయాలకు కేంద్రంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీగా ప్రజా సమస్యలపై దృష్టి సారించాల్సిన నాయకులు పరస్పర ఆధిపత్య పోరులో నిమగ్నమవడం క్షేత్రస్థాయి కార్యకర్తలను నిరాశకు గురిచేస్తోంది. ఈ పరిస్థితిని అధిష్టానం ఎంత త్వరగా చక్కదిద్దుతుందన్నదే ఇప్పుడు జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది.**

**మిర్యాలగూడ/నల్గొండ, ప్రత్యేక ప్రతినిధి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మాత్రం సద్దుమణగడం లేదు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ నుంచి పార్టీ నియామకాల వరకు ప్రతి అంశంలోనూ వర్గ రాజకీయాలు బహిర్గతమవుతుండటంతో జిల్లా కాంగ్రెస్‌లో అసంతృప్తి పెరుగుతోంది. ఒకవైపు ఎమ్మెల్యేలు, మరోవైపు ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలు.. ఇంకోవైపు కొత్తగా పార్టీలో చేరిన నాయకుల మధ్య ఆధిపత్య పోరు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది.

**మిర్యాలగూడలో ఎమ్మెల్యే - ఎమ్మెల్సీ విభేదాలు**

మిర్యాలగూడ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్‌కు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల సమాచారం ఇవ్వడం లేదనే

మిగతా 2లో

## రూ.73 కోట్ల ధాన్యం మింగేసింది ఎవరు..?

- సూర్యాపేటలో ధాన్యం స్కాం
- విజిలెన్స్ వలలో టీఆర్‌పీ జనరల్ సెక్రటరీ
- 29,188 టన్నుల ధాన్యం గల్లంతు
- ప్రభుత్వానికి రూ.73 కోట్ల నష్టం
- ఎఫ్‌సీఐ బియ్యం అక్రమ తరలింపు భగ్నం
- లారీలు స్వాధీనం
- వట్టె జానయ్య యాదవ్‌తో పాటు ముగ్గురిపై కేసు
- రెండు రైస్ మిల్లులు సీజ్

2 లో



# బొల్లికుంటలో శివాజీ విగ్రహ వివాదం.. రాజకీయ రగడ!

- విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటున్నారంటూ మాజీ ఎంపీ, ఎమ్మెల్యేపై గ్రామస్తుల ఆరోపణలు
- మతాల మధ్య చిచ్చు రేపే కుట్రలు జరుగుతున్నాయంటూ ఆందోళన
- ప్రత్యేక కమిటీపై కలెక్టర్ మౌనం ప్రశ్నార్థకం




**ప్రజా వాయిస్, వరంగల్ బ్యూరో:** వరంగల్ జిల్లా బొల్లికుంట గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు అంశం తీవ్ర రాజకీయ, సామాజిక చర్చకు దారితీసింది. గ్రామంలో ఇప్పటికే నిర్ణయించిన స్థలంలో శివాజీ మహారాజ్ విగ్రహాన్ని పెద్ద ఎత్తున ప్రతిష్ఠించాలని గ్రామ పెద్దలు, మహిళా సంఘాలు, హిందూ సేవా సంఘాలు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఈ ప్రక్రియకు కొందరు రాజకీయ నాయకులు అడ్డంకులు సృష్టిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
గ్రామానికి చెందిన మాజీ ఎంపీ పసునూరి దయాకర్, స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తీరుపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో శాంతియుతంగా కలిసి జీవిస్తున్న హిందూ, క్రైస్తవుల మధ్య విభేదాలు సృష్టించేలా కొందరిని ప్రేరేపిస్తున్నారని వారు ఆరోపించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ వంటి జాతీయ వీరుడి విగ్రహాన్ని రాజకీయ వివాదంగా మార్చడం బాధాకరమని పేర్కొన్నారు.
గతంలో ఇదే ప్రదేశంలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించగా, ప్రస్తుతం అదే స్థలంలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అయినప్పటికీ వివిధ కారణాలతో పనులు ముందుకు సాగకపోవడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొన్నట్లు సమాచారం.
ఇటీవల గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి కమిటీ ఏర్పాటు కాలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని, ఆలస్యం చేయకుండా నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**"బొట్టు-బోనాలు ఓట్ల కోసమేనా?" అని ప్రశ్నిస్తున్న గ్రామస్తులు**

ఎన్నికల సమయంలో హిందూ సంప్రదాయాలను ప్రదర్శిస్తూ ప్రజల మద్దతు కోరిన నాయకులు, ఇప్పుడు శివాజీ విగ్రహ ఏర్పాటుకు సహకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఎన్నికల ముందు ఒక విధంగా, గెలిచిన తర్వాత మరో విధంగా వ్యవహరించడం ప్రజలను నిరాశకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఛత్రపతి శివాజీ మహారాజ్ ఏ ఒక్క మతానికే చెందిన వ్యక్తి కాదని, దేశ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ, విగ్రహ ఏర్పాటును వివాదాస్పదం



చేయకుండా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, హిందూ సేవా సంఘాలు కోరుతున్నాయి.

# రూ.73 కోట్ల ధాన్యం మింగేసింది ఎవరు..?



**ప్రజా వాయిస్ సూర్యాపేట బ్యూరో** వేల టన్నుల ప్రభుత్వ ధాన్యం రికార్డుల్లో ఉన్నా గోదాముల్లో మాత్రం జాడ లేకపోవడం విజిలెన్స్ అధికారులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 29,188 టన్నుల ధాన్యం గల్లంతైనట్లు నిర్ధారణ కావడంతో ఇది రాష్ట్రంలోనే అతిపెద్ద ధాన్యం కుంభకోణాల్లో ఒకటిగా మారింది.సూర్యాపేట జిల్లాలో వెలుగుచూసిన ఈ భారీ ధాన్యం స్కాం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ప్రభుత్వ ధాన్యం నిల్వల నిర్వహణలో జరిగిన భారీ అక్రమాలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తులో బయటపడటంతో వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వానికి రూ.73 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

**విజిలెన్స్ దాడుల్లో బయటపడిన అసలు బాగోతం**

స్టాక్ రిజిస్టర్లు ఒక మాట చెబితే గోదాములు మరో కథ చెప్పాయి. రికార్డుల్లో ఉన్న నిల్వలు కనిపించకపోవడంతో ప్రభుత్వ ధాన్యం అక్రమంగా మళ్లించబడిందన్న అనుమానాలు బలపడ్డాయి.బాలెంల పరిధిలోని వజ్ర రైస్ కార్పొరేషన్, వజ్ర వికాస్ రైస్ మిల్లుల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు, నిల్వల వివరాలు, గోదాముల లెక్కలను సరిపోల్చగా భారీ వ్యత్యాసాలు బయటపడ్డాయి. దీంతో ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

**ఎఫ్‌సీఐ బియ్యం మళ్లింపు యత్నం భగ్నం**

ప్రభుత్వానికి చేరాల్సిన బియ్యం.. ప్రైవేట్ మిల్లుకు చేరుతుండగా విజిలెన్స్ అడ్డుకట్ట వేసింది. లారీల స్వాధీనంతో కేసు కీలక మలుపు తిరిగింది.ఎఫ్‌సీఐకి సరఫరా చేయాల్సిన బియ్యాన్ని ఖమ్మం జిల్లా ముదిగొండలోని సత్యసాయి రైస్ కార్పొరేషన్‌కు అక్రమంగా తరలిస్తున్న లారీలను విజిలెన్స్ అధికారులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ బియ్యాన్ని వ్యవస్థబద్ధంగా మళ్లించే ప్రయత్నం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

**టీఆర్‌పీ నేతతో పాటు ముగ్గురిపై కేసు**

కుంభకోణం కేసులో ప్రముఖుల పేర్లు బయటకు రావడంతో వ్యవహారం మరింత సంచలనంగా మారింది.ఈ కేసులో టీఆర్‌పీ జనరల్ సెక్రటరీ వట్టె జానయ్య యాదవ్‌తో పాటు రేణుక, గణేష్‌లపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేశారు. కేసు నమోదు అనంతరం వారి పాత్ర, ఆర్థిక లావాదేవీలు, ఇతర సంబంధాలపై లోతైన విచారణ కొనసాగుతోంది.

**సీజ్ అయిన మిల్లులు విస్తరిస్తున్న దర్యాప్తు**

రెండు రైస్ మిల్లులు సీజ్ బ్యాంకు లావాదేవీలపై నిఘా మరికొందరి పాత్రపైనా ఫోకస్.అక్రమాలు వెలుగులోకి రావడంతో రెండు రైస్ మిల్లులను అధికారులు సీజ్ చేశారు. అక్కడ ఉన్న మిగిలిన ధాన్యాన్ని ప్రభుత్వ పర్యవేక్షణలో ఇతర మిల్లులకు తరలించే చర్యలు చేపట్టారు. ఇదే సమయంలో బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక బదిలీలు, ఇతర వ్యక్తులు లేదా సంస్థల ప్రమేయంపై కూడా దర్యాప్తు విస్తరించినట్లు సమాచారం.

# 'దేశమే ప్రథమం'- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై బండి సంజయ్ స్పందన

మొదటి పేజీ తరువాయి

అవసరమైనప్పుడు బాధ్యత స్వీకరించే ధైర్యం కలిగి ఉండటమేనని పేర్కొన్నారు. పదవులు తాత్కాలికమని, ప్రజల విశ్వాసమే శాశ్వతమని వ్యాఖ్యానించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా బీజేపీ విశ్వసించే విలువలకు అద్దం పడుతుందని అన్నారు.

**ధర్మేంద్ర ప్రధాన్ సేవలకు ప్రశంసలు**

విద్యార్థి ఉద్యమం నుంచి జాతీయ రాజకీయాల్లో కీలక నాయకుడిగా ఎదిగిన ధర్మేంద్ర ప్రధాన్ దశాబ్దాల పాటు ప్రజా జీవితంలో సేవలందించారని బండి సంజయ్ కొనియాడారు. కేంద్ర ప్రభుత్వంలో ఆయన నిర్వహించిన బాధ్యతలను గుర్తు చేస్తూ, దేశానికి అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. "ఇదే బీజేపీ.. ఇదే ప్రజాస్వామ్యం.. ఎల్లప్పుడూ దేశమే ప్రథమం" అంటూ తన సందేశాన్ని ముగించారు.

**నీట్ వివాదం.. రాజీనామా నిర్ణయం**

మరోవైపు నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ తన రాజీనామా లేఖను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సమర్పించారు. అనంతరం ఎక్స్‌లో విడుదల చేసిన సందేశంలో యువత ఆకాంక్షలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అక్రమాలు వెలుగులోకి వచ్చిన వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించామని, మళ్లీ పరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు.

# యువత భవిష్యత్తు కోసం..నా పదవి వీడ్కోలు

**ప్రజా వాయిస్,డెస్క్:** దేశవ్యాప్తంగా విద్యార్థుల ఉద్యమాలు, రాజకీయ దుమారం, విద్యా వ్యవస్థపై నెలకొన్న చర్చల నడుమ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం జాతీయ రాజకీయాల్లో సంచలనంగా మారింది. అయితే సాధారణ రాజీనామా లేఖలా కాకుండా.. దేశ యువతకు సందేశం ఇస్తూ, ప్రజాస్వామ్య విలువలను ప్రస్తావిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆయన రాసిన లేఖ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.భారత ప్రజాస్వామ్యంపై నాకు అపార విశ్వాసం ఉంది. యువతే వికసిత భారత నిర్మాణానికి అసలైన శక్తి అంటూ ప్రారంభమైన లేఖలో గత పది రోజుల పరిణామాలు తన ను తీవ్రంగా కలచివేశాయని పేర్కొన్నారు. జంతర్-మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దేశ వ్యతిరేక శక్తులు తమ ప్రయోజనాలకు ఉపయోగించుకోకుండా చూడాల్సిన అవసరం ఉందని, దేశ ఐక్యతకు ఎలాంటి భంగం కలగకూడదని లేఖలో పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, సహచర మంత్రులు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. దేశసేవే తన జీవిత ధ్యేయమని, భవిష్యత్తులోనూ ప్రజాసేవ కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

**అమిత్ షా ప్రశంసలు...**

రాజీనామా అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేరుగా ధర్మేంద్ర ప్రధాన్ నివాసానికి వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ తీసుకొచ్చిన సంస్కరణలు, నూతన విద్యా విధానం అమలు, విద్యా రంగంలో చేపట్టిన మార్పులు చారిత్రాత్మకమని ఆయన కొనియాడారు. దేశ విద్యా వ్యవస్థను ఆధునికీకరించడంలో ప్రధాన్ కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు.

# మోక్షం దొరికిందో లేదో దేవుడికే తెలుసు

- మానవత్వం మాత్రం మధ్యలోనే చనిపోయింది..!
- మెదక్‌లో విషాద ఘటన
- మూఢనమ్మకాలతో అద్దె ఇంటికి మృతదేహానికి నిరాకరణ
- పాత ఇంటి స్థలం నుంచే అంతిమయాత్ర
- చివరికి కాశీలో అంత్యక్రియలు
- 'అమావాస్య' పేరుతో వివక్ష
- సమాజానికి అద్దం పట్టిన సంఘటన
- మానవత్వం ముందు మూఢనమ్మకాలు గెలవకూడదంటున్న స్థానికులు



ప్రజా వాయిస్, మెదక్:మెదక్ పట్టణంలో చోటుచేసుకున్న ఓ విషాద ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. ఒకవైపు కుమారుడిని కోల్పోయిన కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయి ఉంటే, మరోవైపు మూఢనమ్మకాల కారణంగా ఎదురైన పరిస్థితులు వారి బాధను మరింత పెంచాయి. ఈ ఘటన సమాజంలో ఇంకా కొనసాగుతున్న మూఢ విశ్వాసాలు, సామాజిక వివక్ష, మానవత్వం విలువలపై తీవ్ర చర్చకు దారితీస్తోంది.మెదక్ పెద్దబజార్‌కు చెందిన స్వర్ణకార కుటుంబం శ్రీ జ్యువెలరీ పేరుతో వ్యాపారం నిర్వహిస్తోంది. కుటుంబ పెద్ద అచ్చంపేట రాజు కుమారుడు రాహుల్ హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్నాడు. ఇటీవల కొన్ని సబ్జెక్టుల్లో విఫలమయ్యాననే మనస్తాపంతో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ వార్త కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది.కుటుంబం గతంలో నివసించిన ఇల్లు కూలిపోవడంతో ప్రస్తుతం న్యూ మార్కెట్ వెళ్లే దారిలోని అశోక్ జనరల్ స్టోర్స్ భవనంలోని ఒక అద్దె పోర్షన్‌లో నివాసం ఉంటోంది. అయితే రాహుల్ మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చే సమయంలో అమావాస్య రోజున మృతదేహాన్ని అద్దె ఇంట్లోకి తీసుకురావద్దని ఇంటి యజమాని చెప్పినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మూఢనమ్మకాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని వారు ఆరోపించారు.దీంతో తీవ్ర మనోవేదనకు గురైన కుటుంబ సభ్యులు తమ పాత ఇంటి ఖాళీ స్థలం నుంచే రాహుల్ అంతిమయాత్రను ప్రారంభించారు. అనంతరం కాశీలో అంత్యక్రియలు నిర్వహిస్తే మోక్షం లభిస్తుందనే విశ్వాసంతో భౌతికకాయాన్ని విమానంలో వారణాసికి తరలించి అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.ఈ ఘటన మెదక్ జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దుఃఖంలో ఉన్న కుటుంబానికి అండగా నిలవాల్సిన సమయంలో మూఢనమ్మకాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అమావాస్య కాదు, మూఢనమ్మకాలే అసలు శాపమని, విషాదంలో ఉన్న కుటుంబాన్ని మరింత బాధపెట్టే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉందని పలువురు సామాజికవేత్తలు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఒక యువ ప్రాణం అర్థాంతరంగా ముగియడం ఒక విషాదమైతే, ఆ కుటుంబం కన్నీటిలో ఉన్న వేళ మానవత్వం కన్నా మూఢనమ్మకాలకు విలువ ఇవ్వడం మరింత బాధాకరమనే భావన ఈ ఘటనతో వ్యక్తమవుతోంది. మోక్షం దొరికిందో లేదో దేవుడికే తెలుసు... కానీ మానవత్వం మాత్రం మధ్యలోనే ఎక్కడో చనిపోయిందనే వేదన ఈ సంఘటన మిగిల్చింది.

# కీసరలో దారుణం..

**ప్రజా వాయిస్, మేడ్చల్ :**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో మానవత్వాన్ని మంటగలిపే ఘటన వెలుగులోకి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆరో తరగతి చదువుతున్న ఓ మైనర్ బాలికపై ఆమెకు బంధువులైన ఇద్దరు అన్నలు, మేనమామ లైంగిక దాడికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. బాధితురాలి ఫిర్యాదుతో విషయం వెలుగులోకి రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి ఒక నిందితుడిని అరెస్ట్ చేశారు.

**నమ్మిన బంధువులే నయవంచకులు**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధిత బాలిక తండ్రికి ఇద్దరు భార్యలు ఉన్నారు. పెద్ద భార్యకు ఇద్దరు కుమారులు, రెండో భార్యకు ఒక్క కూతురు ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం చీకటిమామిడిలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఆరో తరగతి చదువుతున్న బాలిక సెలవుల్లో ఇంటికి వచ్చిన సమయంలో ఇంట్లో ఎవరూ లేని వేళ ఇద్దరు అన్నలు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు.
అనంతరం ఈ ఘటనను అడ్డుకోవాల్సిన మేనమామ కూడా బాలికపై అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**పక్కింటి వారికి చెప్పడంతో వెలుగులోకి ఘటన**

కొన్ని రోజులుగా తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్న బాధిత బాలిక తనకు జరిగిన విషయాన్ని పక్కింటి వారికి చెప్పడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**ఒకరు అరెస్ట్.. ఇద్దరి కోసం గాలింపు**

ఈ కేసులో ఒక నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కీసర సీఐ అంజనేయులు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు మహారాష్ట్రలో ఉన్నట్లు గుర్తించామని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**బాధిత బాలికకు రక్షణ చర్యలు**

బాధిత బాలికకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం, భద్రతా దృష్ట్యా నింబోలిఅడ్డలోని జోనల్ హోమ్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. చిన్నారులపై జరిగే లైంగిక నేరాల విషయంలో ఎలాంటి ఉపేక్ష ఉండదని, కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్ స్థానంలో ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలు

మొదటి పేజీ తరువాయి

గుర్తింపు పొందారు. కేంద్ర ప్రభుత్వంలో పలు కీలక శాఖలను విజయవంతంగా నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. అంతర్జాతీయ సౌర కూటమి (ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్) అధ్యక్షుడిగానూ ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**రాజీనామా అనంతరం వేగంగా నిర్ణయం**

నీట్ పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన వెంటనే, విద్యాశాఖలో పరిపాలనా వ్యవహారాలకు అంతరాయం కలగకుండా కేంద్ర ప్రభుత్వం వేగంగా నిర్ణయం తీసుకుని ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు అప్పగించింది. దీంతో విద్యాశాఖ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి.




# లైంగిక బాధితుల గోప్యతకు హైకోర్టు అండ

- సోషల్ మీడియా దిగ్గజాలకు కీలక ఆదేశాలు
- 200కు పైగా వీడియోలు, పోస్టులు తొలగించాలని యూట్యూబ్, గూగుల్, మెటా, ఎక్స్‌కు ఆదేశాలు
- బాధితుల గౌరవ పరిరక్షణలో ఆన్‌లైన్ వేదికల బాధ్యతను స్పష్టం చేసిన తెలంగాణ హైకోర్టు

**హైదరాబాద్, ప్రజా వాయిస్ ప్రతినిధి:** లైంగిక నేరాల బాధితుల గోప్యత, గౌరవ పరిరక్షణకు తెలంగాణ హైకోర్టు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బాధితురాలి గుర్తింపు, ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తూ ఆమె ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నారంటూ దాఖలైన రిట్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, యూట్యూబ్, గూగుల్, మెటా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ తదితర సోషల్ మీడియా సంస్థలకు 200కు పైగా వీడియోలు, పోస్టులను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. అలాగే సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత సంస్థలకు నోటీసులు జారీ చేస్తూ కేసు తదుపరి విచారణను ఆగస్టు 20, 2026 కు వాయిదా వేసింది.బాధితురాలి తరపున హైకోర్టు న్యాయవాది నాగుర్‌బాబు ఈ న్యాయపోరాటాన్ని చేపట్టారు. బాధితురాలి గుర్తింపును తొలగించాలని పలుమార్లు చట్టబద్ధంగా యూట్యూబ్, గూగుల్, మెటా, ఎక్స్ వంటి సోషల్ మీడియా సంస్థలను కోరినా స్పందన లేకపోవడంతో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సోషల్ మీడియా వేదికల్లో బాధితురాలి గోప్యతకు భంగం కలిగించే కంటెంట్ యథేచ్ఛగా కొనసాగుతుండడాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 21 కల్పించిన హక్కులతో పాటు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ప్రస్తావిస్తూ బాధితుల గోప్యతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. లైంగిక నేరాల బాధితుల గుర్తింపును బహిర్గతం చేసే కంటెంట్‌ను వెంటనే తొలగించడం సోషల్ మీడియా సంస్థల బాధ్యత అని పేర్కొన్నారు.ఇంటర్నెట్‌లో ఒకసారి అప్‌లోడ్ అయిన సమాచారం బాధితుల జీవితాలపై శాశ్వత ప్రభావం చూపే ప్రమాదం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. డిజిటల్ వేదికల్లో వ్యక్తిగత గోప్యతను కాపాడటంలో ఆన్‌లైన్ మధ్యవర్తులు చట్టబద్ధమైన బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది.ఈ నేపథ్యంలో న్యాయవాది నాగుర్‌బాబు చేపట్టిన న్యాయపోరాటం లైంగిక నేరాల బాధితుల గౌరవ పరిరక్షణలో కీలక మైలురాయిగా నిలవనుంది. డిజిటల్ వేదికలపై గోప్యత హక్కును పునరుద్ఘాటించిన తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు, బాధితులకు ధైర్యాన్నిచ్చే నిర్ణయంగా న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఉమ్మడి నల్గొండ కాంగ్రెస్‌లో రగులుతున్న వర్గపోరు

మొదటి పేజీ తరువాయి

అసంతృప్తి ఆయన వర్గంలో వ్యక్తమవుతోంది. ప్రోటోకాల్ పాటించడం లేదని, సీనియర్ నాయకులను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇటీవల పార్టీలో చేరిన వారికే ప్రాధాన్యం పెరిగిందని, పాత కాంగ్రెస్ నాయకులను క్రమంగా పక్కన పెడుతున్నారనే చర్చ సాగుతోంది.అలాగే ఇటీవల నియమించిన టౌన్,మండల అధ్యక్షుల ఎంపికలోనూ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తుంది.

**తుంగతుర్తిలో మాటల యుద్ధం**

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. తన నియోజకవర్గంలో తనకు సమాచారం ఇవ్వకుండా పర్యటిస్తున్నారని, ప్రోటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై ఆయన విమర్శలు గుప్పించారు. దీనికి ప్రతిగా రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని మరింత రాజేశాయి. ఈ వ్యవహారం జిల్లా కాంగ్రెస్‌లో వర్గపోరుకు అద్దం పట్టిందని పార్టీ వర్గాలే చెబుతున్నాయి.

**అర్వపల్లిలో ఘర్షణలు**

మండల పార్టీ నియామకాల అంశంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న విభేదాలు అర్వపల్లిలో భౌతిక ఘర్షణలకు దారితీశాయి. రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకునే స్థాయికి పరిస్థితి చేరుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది. అధికార పార్టీలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం కార్యకర్తలను కలవరపెడుతోంది.

**నల్గొండలో రెండు కేంద్రాలు**

జిల్లా కాంగ్రెస్‌లో ప్రస్తుతం రెండు శక్తికేంద్రాలు పనిచేస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారిక డీసీసీ కార్యాలయంతో పాటు కీలక నేతల కార్యాలయాల నుంచి వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంతో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. డీసీసీ అధ్యక్షుడి నియామకం నాటి నుంచి కొనసాగుతున్న విభేదాలు ఇప్పటికీ కొనసాగుతుండటం గమనార్హం.

**అధిష్ఠానం దృష్టి సారిస్తుందా..?**

ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, అంతర్గత విభేదాలను పరిష్కరించే దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ వర్గపోరు కొనసాగితే పార్టీకి రాజకీయంగా నష్టం కలిగే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఉప సర్పంచ్‌లకు గుర్తింపు దిశగా హైకోర్టు కీలక అడుగు

- నక్కలపల్లి ఉప సర్పంచ్ నిరంజన్ గౌడ్ రిట్ పిటిషన్‌పై హైకోర్టు ఆదేశాలు
- గ్రామ పంచాయతీల్లో ప్రజా ప్రతినిధుల గౌరవంపై కొత్త చర్చకు నాంది
- ప్రాతినిధ్యాన్ని నాలుగు వారాల్లో పరిశీలించాలని అధికారులకు హైకోర్టు ఆదేశం



**చేవెళ్ల (ప్రజావాయిస్ ):** గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనుల శిలాఫలకాలు, ప్రారంభోత్సవ బోర్డులపై ఉప సర్పంచ్‌ల పేర్లను కూడా పొందుపరచాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం నక్కలపల్లి గ్రామ ఉప సర్పంచ్ గౌండ్ల నిరంజన్ గౌడ్ తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై కీలక ఆదేశాలు శనివారం వెలువడ్డాయి. పిటిషనర్ సమర్పించిన ప్రాతినిధ్యాన్ని నాలుగు వారాల్లో చట్టబద్ధంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను హైకోర్టు ఆదేశించింది.పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం.వి. రాజ్‌కుమార్ గాబ్రియేల్ వాదిస్తూ, గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ఉప సర్పంచ్‌లు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ శిలాఫలకాలు, ప్రారంభోత్సవ బోర్డులపై వారి పేర్లు పొందుపరచడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో ఉప సర్పంచ్‌ల ప్రోటోకాల్‌కు సంబంధించి ఇప్పటివరకు స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు లేకపోవడాన్ని కూడా ప్రస్తావించారు.దీనిపై స్పందించిన పంచాయతీరాజ్ శాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది, ఈ అంశంపై ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వులు లేవని, పిటిషనర్ సమర్పించిన ప్రాతినిధ్యాన్ని చట్టప్రకారం పరిశీలిస్తామని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు W.P. No.22866 /2026లో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.ఉప సర్పంచ్‌ల అధికారాలు, ప్రోటోకాల్‌పై రాష్ట్రవ్యాప్తంగా చర్చ సాగుతున్న నేపథ్యంలో హైకోర్టు తాజా ఆదేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల అధికారిక గుర్తింపు, గౌరవానికి సంబంధించి భవిష్యత్తులో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించే దిశగా ఈ కేసు కీలకంగా మారే అవకాశముందని న్యాయవర్గాలు సైతం అభిప్రాయపడుతున్నాయి.

# విద్యార్థినుల భద్రతకు 'పోలీస్ అక్క'

- ప్రతి బాలికకు భరోసాగా పోలీస్ శాఖ
- కేజీబీవీలో కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు
- పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్ పరిధికి కానిస్టేబుల్ గౌతమి 'పోలీస్ అక్క'గా నియామకం
- గుడ్ టచ్–బ్యాడ్ టచ్ నుంచి సైబర్ నేరాల వరకు సమగ్ర అవగాహన కల్పించనున్న పోలీస్ శాఖ
- ఎలాంటి సమస్యనైనా దాచుకోవద్దు
- ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి : ఎస్పీ







**ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:**బాలికల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు వారి సమస్యలకు తక్షణ పరిష్కారం అందించే లక్ష్యంతో రాష్ట్ర పోలీస్ శాఖ చేపట్టిన 'పోలీస్ అక్క' కార్యక్రమానికి మెదక్ జిల్లాలో శ్రీకారం చుట్టారు. పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పాల్గొని 'పోలీస్ అక్క' కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థినికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా భయపడకుండా ★'పోలీస్ అక్క'★ను సంప్రదించాలని సూచించారు. బాలికల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని, వారి సమస్యలను తెలుసుకుని గోప్యంగా పరిష్కరించే బాధ్యతను పోలీస్ అక్కలు నిర్వర్తిస్తారని తెలిపారు.పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్ పరిధికి కానిస్టేబుల్ గౌతమిని ★'పోలీస్ అక్క'★గా నియమించినట్లు ప్రకటించిన ఎస్పీ, ఆమె సంప్రదింపు వివరాలను విద్యార్థినులకు అందజేశారు. పాఠశాల, కుటుంబం లేదా సమాజంలో ఎలాంటి సమస్య ఎదురైనా సంకోచించకుండా నేరుగా లేదా ఫోన్ ద్వారా పోలీస్ అక్కకు తెలియజేయాలని సూచించారు.విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, మహిళా రక్షణ చట్టాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు వంటి అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకు సమాచారం పంచుకోవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్–112, సైబర్ మోసాలపై 1930 హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయాలని సూచించారు.'పోలీస్ అక్క' కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేయడం, వారితో స్నేహపూర్వకంగా మమేకమవడం, వారి సమస్యలు, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకుని అవసరమైన మార్గదర్శకత్వం అందించడం జరుగుతుందని ఎస్పీ వివరించారు. విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని, ఎలాంటి సమస్యనైనా దాచిపెట్టకుండా వెంటనే పోలీస్ అక్కకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రేణుక, సందీప్‌రెడ్డి, ఎస్ఐలు శంకర్, ప్రవీణ్‌రెడ్డి, పోచయ్య, పోలీస్ అక్క గౌతమి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# హేమాద్రిలో తొలి ఏకాదశి మహోత్సవం

- వేలాది మంది భక్తుల స్వామివారి దర్శనం

**ప్రజావాయిస్, కీసర:** కీసర మండలం రాంపల్లి దయారా లోని హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి మహోత్సవం శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దివ్య తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణం అంతా "గోవింద... గోవింద..." నామస్మరణతో మారుమోగి భక్తి పారవశ్యంతో కళకళలాడింది.తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామివారి అనుగ్రహం సమస్త భక్తులపై ప్రసరించి, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు, ధనధాన్య సమృద్ధి, సర్వమంగళాలు కలగాలని ఆలయ ట్రస్ట్ ఆకాంక్షించింది.స్వామివారి సేవలో ప్రముఖులు పాల్గొన్నారు.మహోత్సవాన్ని విజయవంతం చేసిన భక్తులు, దాతలు, స్వచ్ఛంద సేవకులు, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది, పోలీసు శాఖ, మీడియా ప్రతినిధులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ ట్రస్ట్ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డితో పాటు ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





# శాశ్వత మార్గ ప్రదాత.. భగవద్గీత

- ఆర్ఎస్ఎస్ ప్రముఖ్, సిద్దార్థ కళాశాల డైరెక్టర్ కూర జయదేవ్
- అనంతగిరి లో ఘనంగా గీతా పారాయణం
- పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం శుభదాయకం
- గీతా వాహిని అధ్యక్షురాలు శ్రీదేవి

**ప్రజావాయిస్/వికారాబాద్ :** తొలి ఏకాదశి పురస్కరించుకొని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన అనంతగిరి అనంత పద్మనాభ స్వామి ఆలయం ఆవరణలో గీతా వాహిని శనివారం ఆధ్వర్యంలో గీతా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్త గా పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రముఖ్, సిద్దార్థ కళాశాల డైరెక్టర్ కూర జయదేవ్ మాట్లాడుతూ..నిత్య జీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు పరిష్కార మార్గం భగవద్గీత చూపుతందన్నారు. భగవద్గీత ఒక పుస్తకం కాదని, భగవద్గీత సారాంశాన్ని తెలుసుకున్న వారు జీవితంలో ఎదురవుతున్న అన్ని సమస్యలను సులువుగా అధిగమిస్తారని తెలిపారు. ప్రపంచంలో చాలా దేశాలు భగవద్గీత ను అనుసరిస్తున్నారని పేర్కొన్నారు. గీతా వాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన గీతా పారాయణం మొదటి రోజు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం సాధారణ విషయం కాదన్నారు. గీతా వాహిని అధ్యక్షురాలు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శ్రీదేవి మాట్లాడుతూ.. శనివారం ప్రారంభమైన గీతా పారాయణం ఇంకా ఎనిమిది రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీత వాహిని ఉపాధ్యక్షురాలు ఎం. లావణ్య, ప్రధాన కార్యదర్శి కె.జయశ్రీ, కమిటీ సభ్యులు కే. విజయ, స్వరూపక్క, ఎస్. మాధురి, ఝాన్సీ రాణి, వరలక్ష్మి , ఎం.స్వాతి, నీరజ, సరళ, సంజీవరాణి, సునీత, రజిత, లక్ష్మి , అపర్ణ, జోత్స్న, నాగరాణి, సరిత, స్వాతి, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద్ రెడ్డి, నాయకులు అమరేందర్ రెడ్డి, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

# హన్మకొండలో వైభవంగా శత, సహస్రశత కటాభిషేకం

- వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే నాయిని

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** హనుమకొండ జిల్లాని ప్రముఖ వేయి స్తంభాల దేవాలయంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా శత, సహస్రశత కటాభిషేక మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. తొలుత శ్రీ గణపతి మహారాజును దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, అనంతరం శ్రీ రుద్రేశ్వర స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ నేతృత్వంలో నిర్వహించిన శత, సహస్రశత కటాభిషేక పూజా కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, జలాశయాలు నిండాలని, రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు.పూజా కార్యక్రమం అనంతరం ఆలయ వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.



# తూముకుంట వాగు నుండి అక్రమ ఇసుకను అరికట్టండి

- మా భూములను కాపాడండి
- అధికారులు స్పందించండి
- ఇందిరమ్మ ఇళ్ల పేరు మీద ఇసుక దోపిడీ
- ప్రభుత్వా ఆదాయనికి భారీగా గండి
- తూముకుంట రైతుల ఆవేదన

**ప్రజా వాయిస్.. వనపర్తి** జిల్లా వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం పరిధిలోని తూముకుంట వాగు నుండి అక్రమ ఇసుకను తరలిస్తున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని తూముకుంట రైతులు వెంకట్ రెడ్డి, పోతుల రాజు, గొల్ల శాలి, ఓంకార్ ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మా సొంత భూమిలో ఎలాంటి అనుమతులు లేకున్నా ట్రాక్టర్ ఓనర్స్ దౌర్జన్యంగా బాటలు తయారు చేసుకొని అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని రైతులు అన్నారు. ఇట్టి విషయాన్ని రైతు ఓంకారం స్థానిక తహసిల్దార్ కార్యాలయానికి వచ్చి ట్రాక్టర్ ఓనర్స్ పైన ఫిర్యాదు చేసిన ఎలాంటి విచారణ చేయలేదని కనీసం వారిని పిలిచి అడగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తూముకుంట వాగు కింద దాదాపు 500 ఎకరాలు పంటలు సాగు అవుతాయని మా సొంత బోర్లను పీకేసి పైపులైను పగలగొట్టి ఇసుకను తరలిస్తున్నారని ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం చూసి చూడనట్టు ఉంటున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. మా బాధనుఎవరితో చెప్పుకోవాలో అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు. ట్రాక్టర్ ఓనర్స్ ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అధికారులను కూడా మభ్యపెట్టి లబ్ధిదారులకు ఇసుకను చేర్చకుండా పక్కదారి పట్టించి కాసులు చేసుకుంటున్నారని రైతులు అంటున్నారు. మా భూములను పంటలు కూడా పండించుకోవడానికి కూడా పనికి రాకుండా ట్రాక్టర్లు తిప్పి పాడు చేశారని అధికారులు మా పొలాల పైకి వచ్చి విచారణ చేయాలని అక్రమ ఇసుకను అరికట్టాలని మా భూములను కాపాడాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.



# కాలునొప్పితో వచ్చి... ప్రాణాలే పోయాయి

- భద్రాచలం ప్రైవేట్ ఆసుపత్రిలో సర్పంచ్ మృతి
- ఆసుపత్రిపై ఆందోళన, కౌంటర్‌కు నిప్పు

**ప్రజా వాయిస్ భద్రాచలం** కాలునొప్పితో చికిత్సకు వస్తే ప్రాణాలే కోల్పోవాల్సి వచ్చింది. భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లోని మిమ్స్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పాల్వంచ మండలం, దంతెల బోరు గ్రామ సర్పంచ్ వెంకటరమణ(36) మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.

**ఎలా జరిగిందంటే...**

దంతెలబోరు ఎస్సీ కాలనీకి చెందిన వెంకటరమణ బుధవారం కాలునొప్పితో ఈ ఆసుపత్రిలో చేరారు. వైద్యులు చికిత్స అందించినా ఆరోగ్యం క్షీణించి ఆపస్మారక స్థితికి వెళ్లడంతో శుక్రవారం మధ్యాహ్నం ఆసుపత్రి వారే ప్రత్యేక అంబులెన్స్‌లో ఖమ్మంకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు ఆరోపించారు.

**ఆసుపత్రి ఎదుట ఆందోళన...**

మృతదేహాన్ని ఖమ్మం నుంచి నేరుగా భద్రాచలంలోని ఆసుపత్రి వద్దకు తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శుక్రవారం అర్ధరాత్రి నుంచి ధర్నా ప్రారంభించారు. "వైద్యుల నిర్లక్ష్యం వల్లే నా భార్య చనిపోయింది" అంటూ భర్త కన్నీరు పెట్టుకున్నారు. శనివారం ఉదయానికి పాల్వంచ మండలం నుంచి దంతెలబోరు గ్రామస్తులు, సిపిఐ నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో తరలిరావడంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత పెరిగింది.

**కౌంటర్‌కు నిప్పు...**

ఆందోళన ఉధృతమైన క్రమంలో కొందరు ఆసుపత్రిలోకి చొరబడి క్యాష్ కౌంటర్, సామగ్రిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. పోలీసులు బందోబస్తు ఉన్నా ఆందోళనకారులు నెట్టుకుంటూ లోపలికి వెళ్లారు.



దీంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**డిమాండ్లు...**

మృతురాలి కుటుంబ సభ్యులు ఆసుపత్రి నిర్లక్ష్యంగా వైద్యం చేసిందని, ఇప్పటికే అనేకమంది ప్రాణాలు పోయాయని ఆరోపించారు. బాధ్యులైన డాక్టర్లు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిని సీజ్ చేయాలని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతురాలికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని తెలిపారు.ఈ ఘటనపై భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, అటవీశాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య నిష్పక్షపాత విచారణ జరపాలని కోరారు. ఆసుపత్రి యాజమాన్యం మధ్యవర్తుల ద్వారా రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.ఈ ఘటన పై భద్రాచలం పోలీసులు భాదితులకు ఫిర్యాదు మేరకు





## మురికి కాలవల సైడ్ డ్రైనేజ్ లకు మోక్షం ఎన్నడో...?

- **మురికి కాలువలు లేక దుర్వాసనను భరించలేకపోతున్నాం**
- **అధికారుల మరియు కౌన్సిలర్ల పని తీరుపై అగ్రహం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు**

..**ప్రజా వాయిస్ జహీరాబాద్:** పట్టణ మున్సిపాలిటీ అభివృద్ధిలో పలు వార్డులలో గత కొద్ది నెలలుగా, కాలువలు డ్రైనేజీ సమస్య తీవ్ర రూపం దాల్చుతుంది. అదేవిధంగా కొన్ని చోట్ల మురికి కాలువలు లేక ఆ మురికి నీరు రోడ్లు మీదకి రావడం వల్ల దాని నుండి వచ్చే దుర్వాసనలతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ కాలనీ వాసులు పురపాలక మున్సిపల్ కార్యాలయంలో అనేక సార్లు, కాలువలు డ్రైనేజీ సమస్య గురించి ఫిర్యాదు చేసిన గాని అధికారులు పటించుకోవడం లేదంటూ, అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే స్థానం లో నూతన డ్రైనేజీ నిర్మాణమైన చేపట్టి సమస్యను పరిష్కరించమని అడిగిన అధికారులు పటించుకోవడం లేదంటూ, స్థానికులు వారి గోడును వెళ్ళబుచ్చుకుంటున్నారు. పారిశుధ్య పనుల సమస్యలు పరిష్కరించాల్సిన మున్సిపల్ అధికారులే ఈ రీతిగా వ్యవహరిస్తే ప్రజలు అనారోగ్యం పాలవుతారని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.ఇప్పటికైనా, మున్సిపల్ శాఖ అధికారులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కాలువలు డ్రైనేజీ సమస్యను పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

# గురుకులాల్లో పెను ప్రమాదం

- **హాస్టల్స్ కావు, డేంజర్ జోన్లు**
- **పిచ్చి ప్రాంకులు... క్రిమినల్ ఆలోచనలు!**
- **రేపటి పౌరులా... బాధ్యతారాహిత్యానికి బాధితులా?**
- **మంథని గురుకులంలో దారుణాలు!**
- **చదువుల తల్లి ఒడిలో చావుతో ఆటలు**
- **బడి కాంపౌండ్‌నే ఆనుకుని మత్తు వ్యాపారం!**
- **గురుకుల పర్యవేక్షణపై గురి తప్పిన మార్గదర్శకాలు!**

**ప్రజా వాయిస్ మంథని** రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు దారి తప్పుతుండడమే కాకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తాజాగా పెద్దపల్లి జిల్లా మంథని బాలుర గురుకుల పాఠశాలలో చోటుచేసుకున్న వరుస సంఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలిచాయి.

**ప్రాంక్ పేరుతో డెటాల్ తాగిన ఇద్దరు విద్యార్థులు:**

మంథని గురుకులంలో చదువుతున్న ఆరో తరగతి ఇద్దరు విద్యార్థులు సరదాగా 'ప్రాంక్' చేద్దామనే ఉద్దేశంతో హాస్టల్లో అందుబాటులో ఉన్న డెటాల్ లిక్విడ్‌ను తాగారు. అస్వస్థతకు గురైన వారిని వెంటనే చికిత్స నిమిత్తం మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**టీచర్ కొట్టాడనే భయంతో మరొకరు**

అదే గురుకులానికి చెందిన మరో విద్యార్థి హోంవర్క్ చేయలేదనే కారణంతో టీచర్ తీవ్రంగా కొట్టడంతో, భయాందోళనకు గురై తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. ప్రస్తుతం ఈ ముగ్గురు విద్యార్థులు మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యుల పర్యవేక్షణలో ప్రస్తుతం వారి పరిస్థితి క్షేమంగానే ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.

**చెవిలో యాసిడ్ పోద్దామనుకున్నాం..**
**ఆరో తరగతి విద్యార్థి షాకింగ్ వ్యాఖ్యలు:**

విద్యార్థుల్లో క్రిమినల్ మైండ్‌సెట్ ఏ స్థాయికి చేరిందో తెలిపే మరో దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి వచ్చింది. రిత్విక్ అనే తోటి విద్యార్థి రాత్రి పడుకున్నాక అతని చెవిలో యాసిడ్ పోయడానికి ప్లాన్ వేసినట్లు చికిత్స పొందుతున్న ఆరో తరగతి విద్యార్థి తెలపడం తీవ్ర కలకలం రేపింది. తల్లిదండ్రుల పర్యవేక్షణ, ప్రేమ లోపించడం, సోషల్ మీడియా ప్రభావం వల్లే పిన్న వయస్సులోనే పిల్లల్లో ఇలాంటి వికృత ఆలోచనలు పెరిగిపోతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మచ్చతెస్తున్న సిబ్బంది నిర్లక్ష్యం –**
**గోప్యంగా ఉంచే ప్రయత్నం?**

మంథని గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, ఆయాలు తమ బాధ్యతల నుంచి తప్పుకోవడమే ఇలాంటి ఘటనలకు మూలకారణమని తెలుస్తోంది. నిన్న కూడా (24/07/26) ఇద్దరు విద్యార్థులు డెటాల్ తాగి ఆసుపత్రికి వచ్చారని ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ధృవీకరించినప్పటికీ, ఈ విషయాన్ని గురుకుల పాఠశాల యాజమాన్యం బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా, పోచమ్మ వాడ డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్స్ సమీపంలో ఉన్న ఈ హాస్టల్ కాంపౌండ్ గోడ దూకి, విద్యార్థులు సిగరెట్లు, గుట్కాల కోసం సమీపంలోని కిరాణా షాపులకు వెళ్తుండటం ఇక్కడ నిత్యకృత్యంగా మారిందని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

**పెరిగిపోతున్న భయాందోళనలు:**

రాష్ట్రవ్యాప్తంగా వివిద గురుకుల హాస్టళ్లు, మహాత్మా జ్యోతిబా పూలే హాస్టళ్లలో విద్యార్థులు తరుచుగా అనారోగ్యానికి గురికావడం, సకాలంలో వైద్యం అందక మరణించడం లేదా మనస్తాపంతో ఆత్మహత్యలకు పాల్పడటం వంటి ఘటనలు పెరిగిపోతున్నాయి. విద్యార్థుల బంగారు భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకుంటుండటంతో



తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కెమికల్స్ దూరంగా ఉంచాలి: సైన్స్ ల్యాబ్‌లలో ఉండే ప్రమాదకర రసాయనాలు విద్యార్థులకు అందుబాటులో లేకుండా భద్రపరచాలి. విద్యార్థుల్లో క్రిమినల్ ఆలోచనలు రాకుండా, వ్యసనానికి గురికాకుండా కౌన్సెలర్లతో తరచూ తరగతులు నిర్వహించాలి.

**కఠిన చర్యలు తీసుకోవాలి**

మంథని ఘటనపై జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి, విచారణ జరిపి నిర్లక్ష్యంగా వ్యవహరించిన గురుకుల సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఐసియులో తల్లి... మంథని రాజకీయంలో మానవత్వం వర్సెస్ కాఠిన్యం!

- **పాతికేళ్ల పగను పక్కనబెట్టి పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు**
- **ప్రాణాలకు తెగించి పనిచేస్తే అక్రమ కేసులు, అవమానాలే మిగిలాయి**
- **హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ ఆవేదన**



**ప్రజా వాయిస్ మంథని** గత 18 ఏళ్లుగా పార్టీ కోసం ప్రాణాలకు తెగించి పనిచేసినా, ఇతరుల మాటలు విని తనను క్రిమినల్‌గా, బ్లాక్‌మెయిలర్‌గా చిత్రీకరించి అక్రమ కేసులు పెట్టి వేధించారని హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ఎన్నికల సమయంలోనే తన తల్లి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయమై స్పందించకపోవడమే కాకుండా, శస్త్రచికిత్స జరిగి చావుబతుకుల మధ్య ఉన్నా కనీసం వాకబు చేయని నాయకుల కాఠిన్యం ఒకవైపు అయితే... పాతికేళ్ల పగను పక్కనబెట్టి మానవత్వం చాటుకున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆప్యాయత మరోవైపు నిలిచిందని ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్ ఆసుపత్రిలో పరామర్శించిన పుట్ట మధు ప్రస్తుతం తన తల్లి ఆరోగ్యం విషమించి సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఐసియు లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ నిన్న రాత్రి స్వయంగా ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, విపత్కర పరిస్థితిలో అండగా ఉంటానని అభయం ఇచ్చారు. పాతికేళ్ల వైరాన్ని కూడా పక్కనబెట్టి, కష్టకాలంలో వచ్చి మానవత్వాన్ని చాటుకున్న పుట్ట మధు ఆప్యాయతను ఈ సందర్భంగా సత్యనారాయణ కొనియాడారు.

**"మీ తప్పు నివేదికలు బొందలో పడేయండి!"**

కొందరు "నలుగురు" వ్యక్తుల కారణంగా 2000 సంవత్సరం నుండి పుట్ట మధుకర్‌తో ఎలాంటి సంబంధం లేకుండా, ఉన్న బంధుత్వాన్ని కూడా పక్కనబెట్టి పార్టీ కోసం పనిచేశానని సత్యనారాయణ స్పష్టం చేశారు. కానీ తనపై "పుట్ట మధుతో టచ్‌లో ఉన్నాడు, అందుకే కొట్లాడడం మానేశాడు" అని పార్టీ నాయకులు, ఇంటెలిజెన్స్ నివేదికల పేరుతో కుట్రపూరితంగా దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ రాకుండా చేయడానికి ఇలాంటి అసత్య ప్రచారాలు చేశారని ధ్వజమెత్తారు.గడిచిన 26 ఏళ్ల కాలంలో తాను పుట్ట మధుకర్‌ను కలిసింది కేవలం రెండే రెండు సార్లు (తన తండ్రి మరణించినప్పుడు, ఇప్పుడు తల్లి ఆసుపత్రిలో ఉన్నప్పుడు) మాత్రమేనని సత్యనారాయణ స్పష్టం చేశారు. ఇప్పటికైనా సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాలను, సత్యదూరమైన నివేదికలను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు.

## మిర్యాలగూడ కాంగ్రెస్‌కు కొత్త సారథులు

- **మండల, టౌన్ అధ్యక్షుల నియామకాలకు టీపీసీసీ ఆమోదం**
- **జిల్లా అధ్యక్షుడు పున్న కైలాస్ నేత సిఫారసులతో ఐదుగురికి కీలక బాధ్యతలు**

**ప్రజా వాయిస్, మిర్యాలగూడ:**మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేతతో సంప్రదింపుల అనంతరం మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని మండల, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలను టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ ఆమోదిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.నియమితులైన అధ్యక్షులుమిర్యాలగూడ టౌన్–1: కొడిరెక్క ఇంద్ర కుమార్మిర్యాలగూడ టౌన్–2: ఎండీ మొయిజ్మిర్యాలగూడ మండలం: గుండు నరేందర్ గౌడ్వేములపల్లి మండలం: ఆర్. రవీందర్ రెడ్డిదామరచర్ల మండలం: కొర్ర నాగు నాయక్పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్ఠం చేయడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుని సంస్థాగతంగా బలోపేతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు తన ఉత్తర్వుల్లో ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన మండల, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత,ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అధిష్ఠానం తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని, గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయడానికి అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యకర్తలను ఏకం చేసి సంస్థాగతంగా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు సహా అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తూ ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటామన్నారు.

**అత్యంత పిన్న వయసులో టౌన్-1 అధ్యక్షుడు**

**మిర్యాలగూడ టౌన్-1 కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొడిరెక్క ఇంద్ర కుమార్ నియామకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అత్యంత పిన్న వయసులోనే ఈ కీలక బాధ్యతలు చేపట్టిన ఆయన, యువతను పార్టీ వైపు ఆకర్షిస్తూ కాంగ్రెస్ సంస్థాగత బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తానని పేర్కొన్నారు. అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ పార్టీ విజయానికి కృషి చేస్తానని చెప్పారు.**



## పరకాల పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు చిరు వ్యాపారులు సహకరించాలి

- **పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**ప్రజా వాయిస్ హన్మకొండ** /పరకాల పరకాల పట్టణ కేంద్రంలోని కూరగాయల మార్కెట్ మరియు చేపల మార్కెట్ ను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించారు. అనంతరం మార్కెట్ పరిసర ప్రాంతాలను పర్యటించి,చిరు వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...మార్కెట్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,మిగిలిపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు.మార్కెట్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, లైటింగ్ సిస్టం ను ఏర్పాటు చేస్తామని..చేపల మార్కెట్ బయట ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని,వీరికి నిర్దిష్టమైన ప్రదేశంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు.నిబంధనలు ఉల్లంఘించి రోడ్డుపై చెత్త వేస్తే పెనాల్టీ విధిస్తామని.. చిరు వ్యాపారం చేసుకునే వారికి వారి యొక్క జీవనదారం కోల్పోకుండా ప్రత్యామ్నాయంగా నిర్దిష్టమైన ప్రదేశం కేటాయిస్తామని .అలాగే పరకాల పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి,ప్రజల సహకారంతోనే పరకాల పట్టణ అభివృద్ధి సాధ్యం,గత పాలకుల వైఖరి వల్ల నిరాధారణకు గురైంది అన్నారు.



## ఫలించిన విద్యార్థుల విద్యార్థి సంఘాల పోరాటం

- **కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్,**
- **నీట్ పరీక్ష పేపర్ లీకేజీ తో నష్టపోయిన విద్యార్థుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి**
- **NTA రద్దు చేయాలి**
- **కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా తో స్వీట్లు పంచుతూ వర్షం వ్యక్తం చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు**
- **SFI హనుమకొండ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్**

**ప్రజా వాయిస్ హన్మకొండ** / కాకతీయ యూనివర్సిటీవిద్యార్థుల విద్యార్థి సంఘాల పోరాటాలతో నే కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ అన్నారు శనివారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడంతో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో స్వీట్లు పంచుతూ హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ఈ దేశంలో విద్యార్థుల జీవితాలతో ఏ ప్రభుత్వం ఆడుకున్న వారికి ఇదే గతి పడుతుందన్నారు ఈ రోజు భారతదేశంలో విద్యార్థులు విద్యార్థి సంఘాలు చేసిన పోరాట ఫలితంగా ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు నీట్ పరీక్షలో నష్టపోయిన విద్యార్థుల కు కేంద్ర ప్రభుత్వం వారికి ఆర్థిక సహాయం అందించాలన్నారు వారి కుటుంబాన్ని ఆదుకోవాలని అలాగే ప్రైవేట్ సంస్థ అయిన NTA రద్దు చేయలని.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ కూడా ఎగ్జామ్స్ పేపర్ లీకులు కాకుండా సరైన తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు చెన్నూరి సాయికుమార్ బిరెడ్డి జశ్వంత్ యూనివర్సిటీ కమిటీ సభ్యులు రాహుల్ రణదీప్ వివేక్ అభిషేక్ అనుఫ్ పవన్ కుమార్ సందీప్ అరుణ్ శివ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు




# విద్యార్థుల భవిష్యత్తుతో ప్రయోగాలా?

- **అస్తవ్యస్తమైన విద్యా వ్యవస్థపై తల్లిదండ్రుల ఆగ్రహం**
- **శిక్షణల పేరుతో తరగతులకు అంతరాయం**
- **పేద విద్యార్థులే నష్టపోతున్నారన్న ఆవేదన**
- **ప్రభుత్వ ఆదేశాల మేరకే అమలు చేస్తున్నాం**
- **మండల విద్యాధికారి నర్సింలు**



**ప్రజా వాయిస్/మోమిన్ పేట్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోందని, దీని ప్రభావం ప్రధానంగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులపై పడుతోందని తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన విద్య అందిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు.వేసవి సెలవుల్లో నిర్వహించాల్సిన ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలను విద్యా సంవత్సరం మధ్యలో నిర్వహించడం వల్ల బోధనకు అంతరాయం కలుగుతోందని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఒకవైపు శిక్షణలకు ఉపాధ్యాయులు వెళ్లడం, మరోవైపు సెలవుల కారణంగా మరికొందరు అందుబాటులో లేకపోవడంతో అనేక పాఠశాలల్లో విద్యార్థులు పూర్తి స్థాయిలో బోధనకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాలలు ప్రారంభమై దాదాపు రెండు నెలలు పూర్తవుతున్నప్పటికీ ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తికాకపోవడంతో కొన్ని పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు పలువురు తరగతులకు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థుల అభ్యాసంపై తీవ్ర ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.విద్యార్థులకు అందించాల్సిన అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాల అమలులో కూడా జాప్యం కొనసాగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రకటనలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో అమలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.అదేవిధంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, ఉపాధ్యాయుల ఖాళీలు, డిజిటల్ విద్యా సదుపాయాల లేమి వంటి సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

**మండల విద్యాధికారి నర్సింలు స్పందన**

ఈ అంశాలపై మండల విద్యాధికారి నర్సింలును వివరణ కోరగా, "ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకే నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను అమలు చేయడం మా బాధ్యత. ఉపాధ్యాయుల సర్దుబాటు, అల్పాహారం, ఇతర ఏర్పాట్లకు సంబంధించిన అంశాలు దశలవారీగా పూర్తి చేస్తాం. త్వరలోనే అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.అయితే, విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వ నిర్ణయాల అమలుతో పాటు క్షేత్రస్థాయిలో కూడా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతులు, పోషకాహార పథకాల అమలుపై ప్రభుత్వం అత్యవసరంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.



## తొలి ఏకాదశి పర్వదినాన దేవాలయాలకు పోటెత్తిన భక్తులు

- పలు గ్రామాల్లో దేవాలయాల్లో పోటెత్తిన భక్తజనం
- వేద మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా విశేష పూజలు

**ప్రజా వాయిస్: గుర్రంపోడు** మండలం,నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలంలోని తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాల పురాతన దేవాలయాలు భక్తజనాలతో కిక్కిరిశాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం, సీతారామచంద్ర స్వామి దేవాలయం, అయోధ్య రామస్వామి దేవాలయాల్లో వేద పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. అలాగే ఉమామహేశ్వర స్వామి దేవాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లోనూ ప్రత్యేక అర్చనలు, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహించారు. మండలవ్యాప్తంగా ఆలయాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, భక్తులు భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

# కరివేపాకు పేరుతో నమ్మించి.. 9 తులాల బంగారం దోచిన 'బిల్లా'

- కటకటాల్లోమరో స్నాచింగ్ కు రెక్కీ చేస్తుండగా మిర్యాలగూడ పోలీసుల వలలో చిక్కిన అంతర్రాష్ట్ర కిలాడీ
- రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఆక్టివా స్కూటీ, మొబైల్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన అడిషనల్ ఎస్పి. రమేష్, ఇంచార్జ్ డిఎస్పి రవి.



**ప్రజా వాయిస్, మిర్యాలగూడ:** అమ్మా... కరివేపాకు ఉందా.. అంటూ పలకరించిన ఓ వ్యక్తి, క్షణాల్లోనే మహిళ నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని ఆమె మెడలోని 9 తులాల బంగారు ఆభరణాలను లాక్కొని పరారయ్యాడు.మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన ఈ చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల విశ్లేషణ, కచ్చితమైన దర్యాప్తుతో కేవలం 13 రోజుల్లోనే ఛేదించి అంతర్రాష్ట్ర నేరగాడు షేక్ నాగుల్ మీరా అలియాస్ బిల్లా ను అరెస్ట్ చేశారు.మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జి. రమేశ్, మిర్యాలగూడ ఇంచార్జ్ డిఎస్పి రవి హాజరయ్యారు. ఈసందర్భంగా అడిషనల్ ఎస్పి తెలిపిన వివరాల ప్రకారం... జూలై 12న మిర్యాలగూడ హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎన్‌వీఆర్–పీవీఆర్ గార్డెన్స్ వెనుక నివాసముంటున్న రిటైర్డ్ హెడ్‌మిస్ట్రెస్ ఇంటి వద్దకు ఆక్టివా స్కూటీపై వచ్చిన నిందితుడు టోపీ, ముఖానికి కర్చీఫ్ ధరించి అడ్రస్ అడిగినట్లు మాట్లాడాతు కరివేపాకు కావాలి అని చెప్పడంతో బాధితురాలు ఇంట్లోని చెట్టు వద్దకు వెళ్లి కరివేపాకు కోస్తుండగా, ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలోని రెండు తులాల పుస్తెలతాడు, నాలుగున్నర తులాల పరకసర్ల చైన్, ఒక తులం నల్లపూసల గొలుసు, ఒకటిన్నర తులాల పగడాల గొలుసును బలవంతంగా లాక్కొని పరారయ్యాడు.బాధితురాలి ఫిర్యాదుతో మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు నెంబర్ ప్లేట్ లేని స్కూటీ, టోపీ, ముఖానికి కర్చీఫ్ ఉపయోగించడంతో కేసు ఛేదించడం పోలీసులకు సవాలుగా మారిందన్నారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ, డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ ఎం. నాగభూషణరావు నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వందలాది సీసీ కెమెరాల ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించాయి. దర్యాప్తులో నిందితుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి, హనుమాన్‌పేట ఫ్లైఓవర్ సమీపంలో మరో చైన్ స్నాచింగ్‌కు రెక్కీ నిర్వహిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.విచారణలో నిందితుడు పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన షేక్ నాగుల్ మీరా అలియాస్ బిల్లా గా గుర్తించామని, అతని వద్ద నుంచి బాధితురాలికి చెందిన 9 తులాల బంగారు ఆభరణాలు, ఆక్టివా స్కూటీ, నేరంలో ఉపయోగించిన టోపీ, కర్చీఫ్, రెడ్‌మీ ఏ2 మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.పోలీసుల విచారణలో బిల్లాపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో రెండు హత్య కేసులతో పాటు చైన్ స్నాచింగ్, దోపిడీ, దొంగతనం కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడైంది. పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినప్పటికీ తిరిగి అదే తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.ఈ కేసును వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన సీఐ ఎం. నాగభూషణరావు, ఎస్సై ప్రవీణ్ కుమార్, పీఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ రాజారాం, కానిస్టేబుళ్లు నల్లగంతుల శ్రీను, శీలం వెంకటేశ్వర్లు, గద్దల హుస్సేన్, బొంత రమేష్, బి. వీరబాబు, జి. నర్సింహా, బి. ప్రసాద్‌లను అదనపు ఎస్పీ జి. రమేశ్ ప్రత్యేకంగా అభినందించారు.

# ఆరుతడి పంటలతోనే అధిక ఆదాయం సాధ్యం

- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి
- ఐనవోలు మండలంలో పెసర, ఆయిల్ పామ్, మామిడి తోటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





**ప్రజా వాయిస్ హన్మకొండ** / ఐ నవోలు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు తక్కువ నీటి అవసరమయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు.శనివారం ఐనవోలు మండలం సింగారం, పున్నేలు గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్, రైతులు సాగు చేస్తున్న పెసర, ఆయిల్‌పామ్ పంటలతో పాటు మామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సింగారం గ్రామానికి చెందిన రైతు ఆకారపు పురుషోత్తం రెడ్డి మూడు ఎకరాల్లో ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి వినియోగంతో పెసర పంటను సాగు చేయడాన్ని కలెక్టర్ అభినందించారు. అనంతరం రైతులతో మాట్లాడి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో వరికి బదులుగా ఏయే పంటలు అనుకూలంగా ఉంటాయో తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పెసర, మినుములు, కందులు వంటి పంటలకు తక్కువ నీరు అవసరమవుతుందని, 60–70 రోజుల్లో దిగుబడి రావడంతో పాటు మార్కెట్లో మంచి ధర కూడా లభిస్తోందని తెలిపారు. ఈ పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నట్లు కలెక్టర్‌కు వివరించారు.అనంతరం పున్నేలు గ్రామంలో రైతు వేల్పుల రమేష్ ఆరున్నర ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను కలెక్టర్ పరిశీలించారు. పంట సాగు కాలం, దిగుబడి, ఆదాయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన రైతు రాజారపు బాలరాజు కూడా ఆయిల్‌పామ్ మొక్కలు నాటినట్లు కలెక్టర్‌కు తెలిపారు. రైతు రవికిరణ్ రెడ్డి మూడు ఎకరాల్లో సాగు చేస్తున్న మామిడి తోటను సందర్శించి తోట నిర్వహణ, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో వరి, పత్తి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరమయ్యే పంటల కంటే పెసర, మినుములు, కందులు, వేరుశెనగ, పొద్దుతిరుగుడు, పచ్చజొన్న వంటి ఆరుతడి పంటలు రైతులకు మరింత ప్రయోజనకరమని పేర్కొన్నారు.అలాగే ఆయిల్‌పామ్ దీర్ఘకాలికంగా రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంట అని, అనుకూల ప్రాంతాల్లో రైతులు ఈ పంట సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇప్పటికే పెసర, ఆయిల్‌పామ్ సాగు ద్వారా ఆదర్శంగా నిలుస్తున్న రైతులను అభినందిస్తూ, ఇతర రైతులు కూడా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం కూడా పెసర, మినుములు, కందుల విత్తనాలను సబ్సిడీపై అందించే దిశగా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో వ్యవసాయ శాఖ ఏడీ ఆదిరెడ్డి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# ఉపసర్పంచుల ఐక్యతకు నాంది

- మోమిన్ పేట్ మండల ఉపసర్పంచుల సంఘం నూతన కమిటీ ఏర్పాటు

**ప్రజావాయిస్ / మోమిన్‌పేట్:** వికారాబాద్ జిల్లా ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎస్. గోపాల్ ఆధ్వర్యంలో ఉపసర్పంచుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లావుడియా రాములు నాయక్ ఆదేశాల మేరకు మోమిన్‌పేట్ మండల ఉపసర్పంచుల సంఘం నూతన కమిటీని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు జిల్లా అధ్యక్షుడు ఎస్. గోపాల్ నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన కమిటీలో మండల అధ్యక్షుడిగా ఆర్. మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కే. రాములు, ప్రకాష్, మల్లేశం, గౌరవాధ్యక్షుడిగా కె. రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సరోజ, వెంకటేష్, బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ అస్లాం, కోశాధికారిగా రమేష్, ఉమ్మడి కార్యదర్శులుగా హెచ్. వెంకటేష్, ఈశ్వరి నియమితులయ్యారు. కమిటీలోని ఇతర సభ్యులకు కూడా నియామక పత్రాలు అందజేశారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులు తమపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఉపసర్పంచుల హక్కుల పరిరక్షణ, ఆత్మగౌరవం, ఐక్యతతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి సంఘం వేదికగా చురుకైన పాత్ర పోషిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపసర్పంచులు, సంఘం నాయకులు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

# గజ్వేల్‌లో రేషన్ బియ్యం రవాణాదారుడిపై పీడీ యాక్ట్

- బచ్చు రత్నాకర్ కు పీడీ యాక్ట్, చెర్లపల్లి జైలుకు తరలింపు
- 2024లో 2, 2026లో 4 కేసులు.. పదేపదే అక్రమాలు
- ఇలాంటివారిపై కఠిన చర్యలు
- సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్

**ప్రజా వాయిస్, గజ్వేల్ :**అక్రమ రేషన్ బియ్యం రవాణాదారుడు బచ్చు రత్నాకర్ (46) పై సిద్దిపేట పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం నిందితుడిని శనివారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా చెర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. గజ్వేల్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్న రత్నాకర్. తెలంగాణ పీడీఎస్ నియంత్రణ ఉత్తర్వులు 2016, అవసర వస్తువుల చట్టం 1955 నిబంధనలు అతిక్రమించారు. రాయిపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని రైస్ మిల్లులో నిల్వ ఉంచి, బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడిపై 2024లో 2, 2026లో 4 కేసులు నమోదు కాగా, పదేపదే అక్రమాలకు పాల్పడటంతో పీడీ యాక్ట్ విధించారు. పేదల నిత్యావసరాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ భద్రత దృష్టిలో ఉంచుకుని కఠిన చర్యలు తీసుకున్నట్లు సిపి రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఇకపై ఇలాంటి అక్రమ వ్యాపారులపై కూడా తీవ్ర చట్టపర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# శంకరంపేటలో ఎస్ఐఆర్ ప్రక్రియ 100 శాతం పూర్తి

- ఎమ్మార్వో నారాయణ



**ప్రజా వాయిస్ పెద్ద శంకరంపేట:** పేట మండలంలో ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల ఆన్‌లైన్ నమోదు 100 శాతం పూర్తయినట్లు తహసీల్దార్ (ఎమ్మార్వో) నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ఓటర్లు, బూత్ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఎవరైనా ఫారాలు సమర్పించకుండా మిగిలి ఉంటే ఈ నెలాఖరులోపు తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేసే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు

# సైబర్ దర్యాప్తు భద్రతల పై ఏసీపీ కీలక ఆదేశాలు

- అమన్ గల్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన మహేశ్వరం ఏసీపీ.ఎస్. జానకి రెడ్డి.



**ప్రజా వాయిస్ ఆమనగల్ :**ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని అమన్‌గల్ పోలీస్ స్టేషన్‌ను మహేశ్వరం డివిజన్ ఏసీపీ.ఎస్.జానకి రెడ్డి సందర్శించి, పోలీస్ స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు నాణ్యత, విజిబుల్ పోలీసింగ్, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం స్టేషన్ విజిటింగ్ నోట్‌లో పలు ముఖ్యమైన సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా అమన్‌గల్ ఎస్‌హెచ్‌ఓ.ఎస్. వెంకటేశ్వర్లు పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న పోలీసింగ్ విధానాలు, పెండింగ్ కేసుల స్థితి, నేర నియంత్రణ చర్యలు మరియు ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఏసీపీకి వివరించారు.

### ఏసీపీ జారీ చేసిన ముఖ్యమైన సూచనలు:

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, నాణ్యతతో ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలి.గ్రేవ్ ( యు ఐ ) కేసుల ఛేదనకు ప్రత్యేక దృష్టి సారించి, నిందితులను త్వరితగతిన గుర్తించాలి.సైబర్ నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో సైబర్ మోసాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలి.రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.సీసీ టీవీస్, ఈ – సాక్షి వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచాలి.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో వినియోగించి నేరాల నియంత్రణను బలోపేతం చేయాలి.మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ భద్రత, రోడ్డు భద్రత తదితర అంశాలపై నిరంతరం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలి.స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, హరితవనంగా ఉంచుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.చివరిగా ఏసీపీ.ఎస్. జానకి రెడ్డి అందించిన సూచనలను అమన్‌గల్ ఎస్‌హెచ్‌ఓ.ఎస్.వెంకటేశ్వర్లు,పోలీస్ సిబ్బంది పూర్తిస్థాయిలో అమలు చేసి,ప్రజలకు త్వరితగతిన,పారదర్శకంగా,నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేయాలని సూచించారు.

# సొంత నిధులతో మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణం

- 37వ వార్డు కౌన్సిలర్ పెద్దబాయి మహిపాల్
- వార్డులో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- హర్షం వ్యక్తం చేసిన కాలనీ వార్డు ప్రజలు



**ప్రజా వాయిస్ జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని 37వ వార్డు శాంతినగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు స్థానిక కౌన్సిలర్ పెద్దబాయి మహిపాల్ తన సొంత నిధులతో మినీ వాటర్ ట్యాంక్‌ను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. హనుమాన్ మందిర్ ఆలయం సమీపంలో శిథిలావస్థకు చేరిన పాత వాటర్ ట్యాంక్‌ను తొలగించి, అదే స్థలంలో నూతన మినీ వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. దీంతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులు తొలగి, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వచ్చింది. అదేవిధంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్న కౌన్సిలర్ మహిపాల్ సేవలను వార్డు ప్రజలు అభినందించారు. తాగునీటి సమస్యకు వెంటనే స్పందించి సొంత ఖర్చుతో ట్యాంక్ నిర్మించడం అభినందనీయమని పేర్కొంటూ ఆయనకు వార్డు ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## గిరిజన గ్రామాల్లో దేశీయ కూరగాయల విత్తనాల పంపిణీ

- 500 ఉచిత విత్తన ప్యాకెట్లు అందజేత.

**ప్రజా వాయిస్ కాసిపేట** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం గిరిజన ప్రాంతాల్లో పోషకాహార భద్రత పెంపొందించడంతో పాటు దేశీయ వంగడాల సంరక్షణ లక్ష్యంగా సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ (సీఎస్ఏ), నాబార్డ్, బెల్లంపల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ (బీఎఫ్‌పీసీ) సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కాసిపేట మండలంలోని గిరిజన గ్రామాల్లో ఉచితంగా దేశీయ కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు.గిరిజన రైతు కుటుంబాలకు 17 రకాల దేశీయ కూరగాయల విత్తనాలతో కూడిన 500 ప్యాకెట్లను అందజేశారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన దేశీయ వంగడాల సాగును ప్రోత్సహించడం, గ్రామీణ కుటుంబాలకు పోషకాహార భద్రత కల్పించడం, గ్రామస్థాయిలో విత్తన బ్యాంకుల ఏర్పాటుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.లక్ష్మీపూర్ కొలంగూడ, కొత్త తిరుమలాపూర్, తిరుమలాపూర్, జెండాగూడ, సవుడుగూడెం, నాయకపుగూడెం, చింతగూడెం, అరిడేపల్లి, పావులగూడెం, పెద్దపూర్ గ్రామాల్లో విత్తనాల పంపిణీ చేపట్టారు. రైతులు ఇంటి ఆవరణలు, పొలాల్లో దేశీయ కూరగాయల సాగు చేపట్టి కుటుంబ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు భవిష్యత్ తరాల కోసం విత్తనాలను సంరక్షించాలని సూచించారు.గిరిజన రైతుల్లో దేశీయ సాగు విధానాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని వరుసగా రెండో ఏడాది నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గత ఏడాది పంపిణీ చేసిన విత్తనాలకు మంచి స్పందన లభించిందని, ఈసారి మరింత మంది రైతులు ఆసక్తిగా పాల్గొన్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఎఫ్‌పీసీ చైర్మన్ ఎంబడి కిషన్, సర్పంచ్‌లు ఆత్రం కళావతి, పెంద్రం శంకర్, అర్క మహేందర్, సంస్థ సీఈఓ, ఉపసర్పంచ్‌లు, ఎఫ్‌పీసీ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, సీఆర్పీలు, రైతులు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.



# స్టేషన్ ఘనపూర్‌లో రాజకీయ వేడి

- కడియం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య
- "నేను చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?" అంటూ సవాల్
- దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి రైతులకు అన్యాయం చేశారని ఆరోపణ



ప్రజా వాయిస్, జనగామ (స్టేషన్ ఘనపూర్):స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలంగాణ తొలి మాజీ ఉపముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో దేవాదుల ప్రాజెక్టు ద్వారా 1.53 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని, ప్రస్తుతం రైతులకు నీరు అందించడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.స్టేషన్ ఘనపూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన రాజయ్య, ఎన్‌డీఎస్ఏ నివేదికతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం అసత్యమని తేలిపోయిందన్నారు. మేడిగడ్డ అన్ని అనుమతులతో నిర్మించిన బ్యారేజ్ అని, కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డ మాత్రమే కాదని, 16 రిజర్వాయర్లతో కూడిన సమగ్ర ఎత్తిపోతల ప్రాజెక్టు అని వివరించారు.తెలంగాణకు రావాల్సిన గోదావరి జలాలను వినియోగించకుండా ఇప్పటికే 105 టీఎంసీలకు పైగా నీటిని ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లనిచ్చారని రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపించారు. కేసీఆర్ పేరును చెరిపివేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఎన్‌డీఎస్ఏ నివేదిక కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు.దేవాదుల ప్రాజెక్టు, ఉప్పుగల్–పాలకుర్తి కాలువ, లిఫ్ట్ ఇరిగేషన్ పనులను నిర్లక్ష్యం చేశారని కడియం శ్రీహరిపై రాజయ్య విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ హయాంలో ఏడు రిజర్వాయర్లతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశామని, తన హయాంలో జరిగిన అభివృద్ధిపై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని, కడియం శ్రీహరి కూడా సిద్ధమా అని సవాల్ విసిరారు.నైతిక విలువలు ఉంటే బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వంతో గెలిచిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీ గుర్తుపై మళ్లీ గెలిచి రావాలని ఆయన సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు సహకారంతోనే కడియం శ్రీహరి రాజకీయంగా ఎదిగారని, ఆ విషయాన్ని మరవొద్దని అన్నారు.చివరగా, బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించబోమని కడియం శ్రీహరిని హెచ్చరించారు. రాజకీయ విమర్శలు హుందాగా చేయాలని, నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత వ్యాఖ్యలు మానుకోవాలని సూచిస్తూ "కబర్దార్" అంటూ తీవ్ర హెచ్చరిక చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, మున్సిపల్ కన్వీనర్ కనకం గణేష్, కౌన్సిలర్ పొన్న రాజేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గట్టు కృష్ణసాయి, సీనియర్ నాయకులు చల్లా చందర్ రెడ్డి, కర్ర సోమిరెడ్డి, గుర్రం చిట్టిబాబు, బత్తుల రాజన్‌బాబు, నాగపురి పావని, మరేడుపాక రామాదేవి, గాదె రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంగమ్మ ఆలయం వద్ద రోడ్డును వెడల్పు చేయాలి

- ఎండోమెంట్ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ మడవేని నరేష్

**ప్రజా వాయిస్, కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని తాళ్లచెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దే పనుల్లో భాగంగా, గంగమ్మ ఆలయం ముందున్న రోడ్డును వెడల్పు చేయాలని ఎండోమెంట్ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ మడవేని నరేష్ కోరారు. శనివారం ఆయన పట్టణనాయకులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధిలో భాగంగా రూ. 2 కోట్ల నిధులతో తాళ్లచెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తూ ప్రభుత్వం పనులు చేపట్టిందనితెలిపారు. అయితే, కట్టను వెడల్పు చేసినప్పటికీ, అక్కడ ఉన్న గంగమ్మ దేవాలయం ముందురోడ్డు చాలా ఇరుకుగా ఉండటాన్ని తాము గమనించామన్నారు. భక్తులకు, సందర్శకులకు ఇబ్బంది కలగకుండా ఆలయ ముందర రోడ్డును వెంటనే వెడల్పు చేయాలని అక్కడ ఉన్న కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, మ్యాకాల గణేష్, యువమోర్చా పట్టణ అధ్యక్షుడు దమ్మ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## దళిత ఎస్సై చిరంజీవి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతి
- కోరుట్ల అంబేద్కర్ యువజన సంఘాల డిమాండ్

**ప్రజా వాయిస్, కోరుట్ల** కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న దళిత అధికారి ఎం. చిరంజీవిని ఎలాంటి సమగ్ర విచారణ లేకుండా సస్పెండ్ చేయడం అన్యాయమని, తక్షణమే ఆయనను విధుల్లోకి తీసుకోవాలని కోరుట్ల నియోజకవర్గ అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కోరుట్లకు వచ్చిన తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను నాయకులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల మెట్‌పల్లిలో హత్యకు గురైన కర్రె సునీత, కోరుట్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసిందనే ప్రచారంలో వాస్తవం లేదనిస్పష్టం చేశారు. సునీత స్టేషన్‌లో ఫిర్యాదు చేయకుండా కసుల గంగారెడ్డి అనే వ్యక్తిఅడ్డుకున్నారని వారు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాస్తవాలను పరిశీలించకుండా, పూర్తిస్థాయి విచారణ చేపట్టకుండా దళిత అధికారి చిరంజీవిపై చర్యలు తీసుకోవడం బాధాకరమన్నారు. తప్పు నిరూపితం కాకముందే సస్పెండ్ చేయడం దళిత అధికారుల పట్ల వివక్ష చూపడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. హత్యకు గురైన కర్రె సునీత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని నాయకులు కోరారు. అలాగే సునీతను ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నకసుల గంగారెడ్డిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఎస్సై చిరంజీవిపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి, ఆయనకు న్యాయం చేయాలనికోరారు. ముందుగా కోరుట్ల పట్టణానికి చేరుకున్న కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.. బాబాసాహెబ్బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్, రాష్ట్ర నాయకులు బలిజ రాజారెడ్డి, వుయ్యాల నర్సయ్య, ఎమ్మార్పీఎస్ జర్నలిస్టు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు చెట్ పల్లి లక్ష్మణ్, కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మి నారాయణ, డివిజన్ అధ్యక్షులు ఉయ్యాల శోభన్, మాల మాదిగ కుల సంఘాల నాయకులు పసుల కృష్ణ ప్రసాద్, శనిగారపు రాజేష్, బలిజ రాజశేఖర్, పసులు చిన్నయ్య, మోర్తాడ్ రాజశేఖర్, సామల్ల వేణు, సత్యం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన్ దిగారు.. ఇక దిగాల్సింది ప్రధాని

- తెలంగాణ రాష్ట్ర అయిల్ షెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఐక్య ఉద్యమం,విపక్ష నేత రాహుల్ గాంధీజీ పోరాటానికి దక్కిన విజయమని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ షెడ్. కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. ఓ సందర్భంలో ఆయన మాట్లాడుతూ బెదిరింపులకు జడవకుండా, కేసులకు భయపడకుండా, లాఠీ దెబ్బలకు ఓర్చుకుంటూ, రక్తాన్ని సైతం చిందించి, మంత్రిని గద్దె దించే వరకు అలుపెరగని పోరాటం చేసిన ప్రతి విద్యార్థికి, యువతకు నా అభినందనలు అని మత పిచ్చి బీజేపీ అహంకారానికి, ప్రశ్నించే గొంతును అణచివేయాలని చూసే కుట్రలకు, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే చర్యలకు గట్టి సమాధానం ఇది. విద్యాశాఖ మంత్రి రాజీనామా దేశ ప్రజల్లో పెరిగిన అసంతృప్తికి నిదర్శనం. బీజేపీ అంతానికి తొలిమెట్టు. నీట్ పేపర్ లీకులను దాచేందుకు ఎన్ని కుయుక్తులు పన్నినా,ఉద్యమాన్ని తొక్కిపెట్టాలని చూసినా, విద్యార్థి శక్తి ముందు చివరకు తలవంచడం మోదీజీ అండ్ కో కి చెంపపెట్టు. అన్నారు.పిల్లల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే యువత తగిన సమాధానం చెప్తుందని నిరూపించిన సందర్భమిది. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, విద్యార్థుల హక్కులను రక్షించేందుకు, ప్రజా వ్యతిరేక విధానాల అంతానికి ప్రజలతో కలిసి కాంగ్రెస్ నిరంతర పోరాటం చేస్తుంది అన్నారు.



## దేశ రక్షకులను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత

- ఎస్సై వెంకన్నకార్గిల్ వీరులకు ఘన నివాళులు
- గౌతమ్ పాఠశాలలో దేశభక్తి వెల్లువ
- విద్యార్థుల ఆర్మీ ప్రదర్శనలు విశేష ఆకర్షణ

**ప్రజా వాయిస్: గుర్రంపోడు** మండలం,నల్గొండ జిల్లా,గుర్రంపోడు మండలంలోని గౌతమ్ పాఠశాలలో కార్గిల్ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల చైర్మన్ నింబారి రమేష్ రెడ్డి, కరస్పాండెంట్ శిరీష రెడ్డి, గుర్రంపోడు మండల ఎస్సై వెంకన్న, ఆంజనేయులు నాగేందర్ రెడ్డి ప్రిన్సిపాల్ రేచల్ హాజరై కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎస్సై వెంకన్న, దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల సేవలు చిరస్మరణీయమని, వారి త్యాగస్ఫూర్తిని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకుని దేశభక్తితో ఎదగాలని సూచించారు.అనంతరం విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆర్మీ దుస్తులు ధరించి దేశభక్తిని ప్రతిబింబించే ప్రదర్శనలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో శ్రీను, నరేష్, కార్తీక్, గాయత్రి, యమునా, జ్యోతి, రషిదా, హసీనా, సిసింద్రీ, నవీన్, స్వాతి, కృష్ణవేణి, సుప్రియ, వర్ష, శ్రీలక్ష్మి తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# అభివృద్ధే అజెండా..మూడు కీలక పనులకు శ్రీకారం

- కంపాసాగర్ లో వ్యవసాయ మార్కెట్ కమిటీ సబ్ యార్డుకు శంకుస్థాపన
- ముకుందాపురంలో మహిళా సంఘ బంధ భవనం (వెలుగు కార్యాలయం) ప్రారంభం
- రూ.3 కోట్లతో నిడమనూరు–రాజన్నగూడెం బీటీ రోడ్డును ప్రజలకు అంకితం
- రైతులు, మహిళలు, గ్రామీణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలే లక్ష్యం
- ఒకే రోజు మూడు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి



**ప్రజా వాయిస్ | నాగార్జునసాగర్** నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరింత వేగం పెంచుతూ స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి శనివారం ఒకే రోజు మూడు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. వ్యవసాయ రంగం, మహిళా సాధికారత, గ్రామీణ రహదారుల అభివృద్ధికి సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టి ప్రజలకు అంకితం చేశారు.ముందుగా త్రిపురారం మండలంలోని కంపాసాగర్ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సబ్‌యార్డుకు ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామ ప్రజలు, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, సర్పంచ్, ఉపసర్పంచ్, మాజీ ప్రజాప్రతినిధులు, సోషల్ మీడియా ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు. సబ్‌యార్డు అందుబాటులోకి రావడంతో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా విక్రయించుకునే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామంలో మహిళా సంఘ బంధ భవనం (వెలుగు కార్యాలయం)ను ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్, యువజన నాయకులు, మండల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలకు ఈ భవనం ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.తదుపరి నిడమనూరు మండలంలోని రాజన్నగూడెం గ్రామంలో రూ.3 కోట్ల PMGSY నిధులతో నిర్మించిన నిడమనూరు–రాజన్నగూడెం బీటీ రహదారిని ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి ప్రారంభించారు. గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామశాఖ అధ్యక్షుడు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రహదారి ద్వారా గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమవడంతో పాటు రైతుల పంటల రవాణాకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు, మహిళా సంఘాల బలోపేతం, గ్రామీణ రహదారుల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తూ అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి స్పష్టం చేశారు.